క్లుప్తంగా

వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



చూచుకొండలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక : చూచుకొండలో శనివారం కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇంటింటా ధర్మ ప్రచారంలో భాగంగా వేంకటేశ్వరస్వామి ఆలయంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీనివాస నామస్మరణతో చూచుకొండ మార్మోగింది. చూచుకొండతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

రైతులకు ఎరువుల పంపిణీ



రైతులకు ఎరువులు అందజేస్తున్న అరబుపాలెం సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక : రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సేవలందిస్తున్నారని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. అరబుపాలెంలో శనివారం రాయితీపై ఎరువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్‌లో రైతులకు అవసరమయ్యే ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొడ్డేడ హైమావతి, వీఏఏ సత్య రవి రాజ్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణుని అనుపు మహోత్సవం



శ్రీకృష్ణుని విగ్రహాన్ని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : నారాయుడుపాలెంలో శనివారం శ్రీ కృష్ణుని అనుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనకు భక్తు లు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి శ్రీ కృష్ణుని విగ్రహాన్ని దర్శించుకునేందు కు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. దీని లో భాగంగా వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ శ్రీ కృష్ణుని విగ్రహా న్ని దర్శించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కోరుకొండ రాజు, మల్లయ్య, సూరిశెట్టి రామకృష్ణ (ఎస్ఆర్) పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వర్షం

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. వరినాట్లకు ఈ వర్షం మేలు చేస్తుందని పలువురు రైతులు తెలిపారు. మరోపక్క శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహించడంతో సాగునీటి ఇబ్బందులు లేవని రైతులు పేర్కొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార మాసోత్సవాల్లో మాట్లాడుతున్న బాబ్జి

రాంబిల్లి : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్.వి. సూర్యనారాయణ, ఎంపీటీసీ అల్లవరపు బాబ్జి అన్నారు. గోకివాడలో శనివారం పోషకాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పోషకాహార ప్రాధాన్యాన్ని అందరూ గుర్తించాలన్నారు. టాటా ట్రస్టు, ఏషియన్ పేయింట్స్, విజయవాహిని ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పోషకాహార తయారీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



కోటవురట్లలో కొలువు తీరేందుకు సిద్ధంగా ఉన్న గణనాథులు



అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న కైట్స్ విద్యార్థులు

మట్టి వినాయకుడినే పూజిద్దాం



గణపతి వేడుకల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ అప్పలరాజు



మట్టి వినాయక ప్రతిమలు అందజేస్తున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలు వినియోగించాలని స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు కె.వి. రమణ, పి.వి. సీతారామరాజు కోరారు. సంస్థ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు. ఏటా సంస్థ ద్వారా మట్టి వినాయక విగ్రహాలను అందజేస్తున్నామన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను వినియోగించకుండా మట్టితో తయారు చేసిన విగ్రహాలను పూజించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలో ముందస్తు చవితి వేడుకలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని భవానీ విద్యానికేతన్‌లో శనివారం ముందస్తు వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. పాఠశాలలో వినాయకుడిని కొలువు ఉంచి పూజలు చేశారు. చిన్నారులు సంప్రదాయ పద్ధతిలో వస్త్రాలు ధరించి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు.

మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ

పాయకరావుపేట : పట్టణంలో గల హైమా నేత్రాలయ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను సీఐ పి.అప్పలరాజు చేతుల మీదుగా పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు ఎంతో మంచిదని సీఐ అన్నారు. ఈ కార్యక్రమంలో హైమా నేత్రాలయ వైద్యులు డాక్టర్ పి.ప్రసాద్, పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మురళీకృష్ణారెడ్డి, ఎస్ఐ బి.జోగారావు, వ్యాపారవేత్త మామిడి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు అడపా ప్రకాష్ పాల్గొన్నారు.

చవితి సంబరాలకు గణనాథుడు సిద్ధం

కోటవురట్ల: వినాయక చవితి సంబరాలకు పల్లెలు ముస్తాబవుతున్నాయి. రంగు రంగుల్లో గణేషుడు ఆకట్టుకుంటున్నాడు. పర్యావరణ హితంగా మట్టి వినాయకుని ప్రతిమలు సిద్ధమవుతున్నాయి. వీధి వీధిన గణనాథుని కోసం పందిళ్లు వేస్తున్నారు. ఇప్పటికే గణనాథుని ప్రతిమల విక్రయాలు జోరందుకున్నాయి. చవితి రోజున నెలకొల్పేందుకు నచ్చిన గణనాథుని ప్రతిమకు అడ్వాన్స్ చెల్లించి ఏర్పాట్లు చేస్తున్నారు.

కైట్స్ విద్యార్థుల ర్యాలీ

అచ్యుతాపురం(అనకాపల్లి): మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని కైట్స్ కళాశాల విద్యార్థులు శనివారం ర్యాలీ నిర్వహించారు. రసాయనాలతో కూడిన రంగులతో రూపొందించే విగ్రహాలను నిమజ్జనం చేసినప్పుడు నీరు కలుషితం అవుతుందని తెలిపారు. కైట్స్ కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, కైట్స్ విద్యా విహార్ కరస్పాండెంట్ రెడ్డి గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్స్ ఆడారి అప్పలనాయుడు, సన్యాసిరావు, డైరెక్టర్లు అడిగర్ల శంకర్‌రావు, విల్లూరి ప్రసాద్, సరిసా నాగేశ్వరరావు, అచ్యుతాపురం మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, పీఈటీలు పాల్గొన్నారు.

వేడుకలకు అనుమతి తప్పనిసరి

కోటవురట్ల: బహిరంగ ప్రదేశాలలో చవితి వేడుకలకు అనుమతి తప్పనిసరని ఎస్ఐ నారాయణరావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పందిళ్లు, మండపాలు ఏర్పాటు చేసి వినాయకుని విగ్రహాలు ప్రతిష్ఠించేందుకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతి తీసుకోవాలని సూచించారు. సంబరాలు చేసుకునేందుకు 5 లేదా అంతకంటే ఎక్కువ మంది కమిటీగా ఏర్పడి వారి వివరాలు పోలీసు స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. పంచాయతీ స్థలాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయడానికి పంచాయతీ అనుమతి ఉండాలన్నారు. ఫైర్, విద్యుత్ శాఖల నుంచి కూడా అనుమతి తీసుకోవాలన్నారు. శాంతియుతంగా వేడుకలు జరుపుకోవాలన్నారు.



భవానీ విద్యానికేతన్‌లో సంప్రదాయ దుస్తులు ధరించి గణనాథుడ్ని పూజిస్తున్న చిన్నారి

పాయకరావుపేట : మండలంలో ఏర్పాటు చేసే వినాయక పూజ మండపాలకు, పందిళ్ళకు పోలీసు, ఫైర్, విద్యుత్ శాఖల అనుమతులను తీసుకోవాలని సీఐ అప్పలరాజు అన్నారు. అరట్లకోట గ్రామంలో పలువురికి అవగాహన కల్పించారు. ఉదయం 6 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మైకులు పనిచేయాలన్నారు. పోలీసు శాఖ అనుమతి ప్రకారమే గణేష్ నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): వినాయక చవితి నేపథ్యంలో మండపాలు,పందిర్లు వేసే వారు పోలీసుల వద్ద అనుమతి తీసుకోవాలని అచ్యుతాపురం సీఐ మురళీరావు తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నిబంధనలను వివరిస్తున్నామని తెలిపారు. రోడ్ల పక్కన ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగకుండా పందిళ్లు వేసుకోవాలని సూచించారు. సౌండ్ సిస్టంకు ఉదయం 6 గంటల నుంచి రాత్రి పది గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. ఉత్సవాల వివరాలను పోలీస్ స్టేషన్‌లో ఉత్సవ కమిటీ సభ్యులు సమర్పించాలని కోరారు.


చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దాలి



అవగాహన ర్యాలీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి, ప్రజాప్రతినిధులు

యలమంచిలి : ప్రతి ఒక్కరూ మొక్కలు విధిగా నాటి పర్యావరణాన్ని కాపాడాలని మున్సిపల్ చైర్ పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. స్వచ్ఛ భారత్ మిషన్, ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 యూత్ వర్సెస్ గార్బేజ్ కార్యక్రమంలో భాగంగా శనివారం యలమంచిలిలో విద్యార్థులు, మెప్మా సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో కలసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓజోన్ పొర సంరక్షణకు, యువత ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణకు నడుం బిగించాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని యలమంచిలి మున్సిపాలిటీని చెత్త రహిత పట్టణంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని కాపాడుతామని ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి ర్యాలీగా వెళ్లి వైఎస్సార్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కె.కొండలరావు, మున్సిపల్ మేనేజర్ ప్రభాకరరావు, డీఈ వీరయ్య, శానిటరి ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, టౌన్‌ప్లానింగ్ అధికారి శ్రీలక్ష్మి, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ బీబీ, పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు వైయస్సార్‌సీపీ నాయకులు దాసరి కుమార్, త్రినాథ్, మెప్మా సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


‘డీసీసీబీలో డిపాజిట్లపై అధిక వడ్డీ’



పీఏసీఎస్ వద్ద కరపత్రాలు అందిస్తున్న చైర్మన్ రాజేష్ ఖన్నా

పాయకరావుపేట : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) విశాఖపట్నం డిపాజిట్‌ల సేకరణ, అభివృద్ధికి స్థానిక పీఏసీఎస్ వద్ద డిపాజిట్ల సేకరణ కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీసీబీ ఫీల్డ్ ఆఫీసర్ భాస్కర్ మాట్లాడుతూ డిపాజిట్‌లపై అధిక వడ్డీ ఇవ్వడం జరుగుతుందని, గోల్డ్ లోన్ పై తక్కువ వడ్డీకే రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. సీనియర్ సిటిజన్‌లకు 8.25 శాతం వడ్డీ ఇవ్వడం జరుగుతుందన్నారు. డీసీసీబీలో లాకరు సదుపాయం, ఏటీఎమ్ సదుపాయం కూడా కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్‌ఖన్నా చేతుల మీదుగా డీసీసీబీ ముద్రించిన కరపత్రాలను సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సిబ్బంది మహేష్, పీఏసీఎస్ సీఈవో పి.నాగభూషణం, సిబ్బంది, సభ్యులు ఉన్నారు.

స్కూల్ గేమ్స్‌లో సత్తా చాటిన విద్యార్థినులు



వివిధ విభాగాల్లో నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

కోటవురట్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన మండల స్థాయి క్రీడా పోటీలలో కె.వెంకటాపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు పలు విభాగాలలో సత్తా చాటారు. అండర్ 14 విభాగం ఖోఖోలో ద్వితీయ, అండర్ 17 విభాగం 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ, 200 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ, 600 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ, తృతీయ స్థానాలు పొందారు. బాలురు 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ, 400 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం పొందారు. నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొనేందుకు అండర్ 14 విభాగం కబడ్డీకి ముగ్గురు, ఖోఖోకు ఇద్దరు, అండర్ 17 విభాగం ఖోఖోకు నలుగురు, కబడ్డీ నలుగురు, రన్నింగ్‌కి ఐదుగురు, యోగాకి ఒకరు ఎంపికైనట్టు పీడీ లక్ష్మి తెలిపారు.

పైలా మాణిక్యం సేవలు స్ఫూర్తిదాయకం



విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఎం.జగన్నాథపురం ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు, మాజీ సర్పంచ్ పైలా మాణిక్యం 11వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఎం.జెపురం ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాణిక్యం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాణిక్యం గ్రామానికి చేసిన సేవ, పాఠశాల అభివృద్ధికి చూపిన చొరవ గురించి గుర్తు చేసుకున్నారు. విద్యార్థులకు పెన్నులు, గ్లూకోజ్ ప్యాకెట్లు అందజేశారు. కుశాయి రాంబాబు, వెంకట రమణ,వెంకట ఈశ్వరరావు,కర్రెడ్ల బుల్లమ్మ,వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఎన్నో లాభాలు

అచ్యుతాపురం(అనకాపల్లి): క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు,శారీరక ధారుఢ్యం మెరుగుపడుతుందని అచ్యుతాపురం ఎస్ఐ సన్యాసినాయుడు అన్నారు. కైట్స్ విద్యా విహార్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ శనివారంతో ముగిశాయి. నియోజకవర్గ స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఎస్ఐ సన్యాసినాయుడు చేతుల మీదుగా మెమెంటోలు అందజేశారు.



మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన వారికి పతకాలు అందజేస్తున్న ఎస్ఐ సన్యాసినాయుడు

అచ్యుత విద్యాసంస్థల అధినేత పల్లె శేషగిరిరావు, మాజీ సర్పంచ్ రెడ్డి అప్పలనాయుడు, కైట్స్ విద్యాసంస్థల అధినేతలు రెడ్డి చిరంజీవి, రెడ్డి గణేష్, పూడిమడక మెరైన్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, పీఈటీలు శ్యామ్, ధర్మిరెడ్డి రాజు, మనోహర్, త్రినాథ్ పాల్గొన్నారు.

పార్టీ కోసం సైనికుల్లా పనిచేయాలి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఆ పార్టీ నాయకులు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ అచ్యుతాపురం మండల శాఖ అధ్యక్షునిగా నియమితులైన దేశంశెట్టి శంకరరావు అలాగే జిల్లా అధికార ప్రతినిధి పిన్నమరాజు వాసు శనివారం ప్రసాద్‌ను మునగపాకలో మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. పదవులు అలంకార ప్రాయం కాకుండా పార్టీ కోసం కష్టపడి పని చేయాలన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో అచ్యుతాపురం మండల జెడ్పీటీసీ సభ్యులు లాలం రాంబాబు, ఎంపీపీ కోన సంధ్య బుజ్జి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉపాధి అవకాశాలు



మండల స్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రసాద్

మునగపాక: విద్యలో రాణించడం ద్వారానే పేదరికాన్ని జయించవచ్చని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పేర్కొన్నారు. తిమ్మరాజుపేట డేవెన్సీ అంతర్జాతీయ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు శనివారం సాయంత్రం ఆయన బహుమతులు అందజేశారు. ప్రసాద్ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో రాణించిన వారికి ఉద్యోగ,ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. మండల స్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీల్లో రాణించాలన్నారు. తిమ్మరాజుపేట హైస్కూల్ హెచ్‌ఎం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, డేవెన్సీ స్కూల్ డీన్ సూరిబాబు, మునగపాక, నాగులాపల్లి పీఏసీఎస్‌ల సీఈవోలు ఆడారి గోపాలరావు, మళ్ల స్వామి పాల్గొన్నారు. మండల స్థాయిలో నిర్వహించిన క్రీడాపోటీల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతో ఓజోన్‌కు రక్షణ



పాములవాక జెడ్పీ హైస్కూల్‌లో ఓ3 ఓజోన్ ఆకృతిలో విద్యార్థుల అక్షర రూపం



సర్వసిద్ధి పీహెచ్‌సీలో మొక్కలు నాటుతున్న వైద్యాధికారి వాసంతి



ఓజోన్ ఆకారంలో ఏర్పడిన విద్యార్థినులు

కోటవురట్ల : మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో వరల్డ్ ‘ఓజోన్ డే’ను శనివారం ఘనంగా నిర్వహించారు. ఓజోన్‌ను కాపాడుకునేలా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థులు వో3 ఓజోన్ అక్షర ఆకృతిగా ఏర్పడి కనువిందు చేశారు. పాములవాక జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వి.లక్ష్మీనారాయణ, పీడీ అచ్యుతరావు, ఉపాధ్యాయులు వరప్రసాద్, రాము, సోమేష్, రామారావు, రామలక్ష్మి పాల్గొన్నారు. కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్‌లో హెచ్‌ఎం ఎం.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులు వో3 ఆకృతిగా ఏర్పడ్డారు. మొక్కలను పెంచడం ద్వారా ఓజోన్‌ను కాపాడుకోవచ్చని వివరించారు.

ఎస్.రాయవరం: ప్రకృతి వనరుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమణశ్రీ అన్నారు. ఓజోన్ పరిరక్షణ దినోత్సవం పురస్కరించుకుని పాఠశాలలో పలు ప్రదర్శనలు చేశారు. విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.బహుమతులు అందజేశారు. పి.ధర్మవరంలో మట్టిగణపతులు తయారు చేసి పంపిణీ చేశారు. పెదగుమ్ములూరు ఉన్నత పాఠశాలలో కూడా ఓజోన్ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా విన్యాసాలు చేసి, ర్యాలీ నిర్వహించారు.సర్వసిద్ధి పీహెచ్‌సీలో వైద్యాధికారి వాసంతి మొక్కలు నాటి పర్యావరణ విశిష్టతను వివరించారు.

కస్తూర్బా పాఠశాలలో ఓజోన్ దినోత్సవం

రాంబిల్లి : రాంబిల్లి కస్తూర్బా పాఠశాలలో ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థినిలు ఓజోన్ ఆకారంలో ఏర్పడి ఎంతో ఆకట్టుకున్నారు. భూమిపై జీవరాశి మనుగడకు ఓజోన్ ఎంతో ఉపయోగపడుతుందని ప్రిన్సిపాల్ ప్రమీల అన్నారు. భూమి చుట్టూ గొడుగులా ఆవరించి ఓజోన్ ఆవరించి కవచంలా కాపాడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): భవానీ విద్యా నికేతన్‌లో ఓజోన్ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సూర్యుని నుంచి వచ్చే అతి నీలలోహిత కిరణాలు భూమి మీదకు నేరుగా పడకుండా కాపాడుతున్న ఓజోన్ పొరను ప్రతిబింబించే విధంగా విద్యార్థులు ప్రదర్శన ఇచ్చారు. అతినీల లోహిత కిరణాలు నేరుగా భూమి మీదకు చేరుకుంటే ప్రజలకు చర్మ వ్యాధులు వస్తాయని, కాంతి కాలుష్యాన్ని ప్రభావాన్ని తగ్గించేందుకు ఈ పొర దోహద పడుతుందని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, సంతోష కుమారి పాల్గొన్నారు.

వేమగిరిలో దళిత రక్షణ యాత్ర

ఎస్.రాయవరం : దళిత రక్షణ యాత్రలు విజయవంతం చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ అన్నారు. వేమగిరి గ్రామంలో శనివారం దళిత రక్షణ యాత్ర నిర్వహించారు. గ్రామస్తులకు యాత్ర ప్రాధాన్యం వివరించారు. దళితులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.

డ్వాక్రా మహిళలకు కూరగాయల విత్తనాలు పంపిణీ



స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేసిన కూరగాయల విత్తనాలు ప్రదర్శన

కశింకోట: కూరగాయల విత్తనాలు నాటి ఆరోగ్య వంతమైన పంటలు పండించుకోవాలని ఎంపీపీ కలగా లక్ష్మి కోరారు. కశింకోటలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తక్కువ ధరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేసిన కూరగాయల విత్తనాలను పెరడు, పంట భూముల గట్లు, మడుల్లో నాటుకొని ఆరోగ్యకరమైన కూరగాయలను ఉత్పత్తి చేసి కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలన్నారు.

ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు మండల పరిషత్ సమావేశాలకు రాకపోవడం పట్ల సభ్యులు నిరసన తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వాలని, ఎక్సైజ్ సంబంధిత సమస్యలు పరిష్కరించాలని సభ్యులు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, వైఎస్ ఎంపీపీలు నమ్మి మీనా, పెంటకోట జ్యోతి, వాటర్ వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, ఎంపీడీవో వి.వి.రవికుమార్, తహసీల్దార్ జి. సత్యనారాయణ, వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, ఈఒఆర్‌డి ఎస్. రమేష్, సర్పంచ్‌లు, ఎంపీటీలు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరానికి స్పందన



తాళ్లపాలెంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగిస్తూ పోస్టర్ల ప్రదర్శన

కశింకోట: తాళ్లపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. విశేష స్పందన లభించింది. అగనంపూడి వద్ద ఉన్న హోమీ బాబా క్యాన్సర్ ఆస్పత్రి నుంచి వైద్యులు సంగీత, తరుణ్, ఆరోగ్య సిబ్బంది వచ్చి క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్‌పై అవగాహన కలిగిస్తూ పోస్టర్‌లను ప్రదర్శించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, పీహెచ్‌సీ వైద్యుడు రమేష్, ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, హైస్కూలు విద్యా కమిటీ అధ్యక్షుడు గుమ్మడి నారాయణరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ముసిలినాయుడు, చిన్ని రాజేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, పాల్గొన్నారు.